క్లుప్తంగా

తెలంగాణలో ప్రజావ్యతిరేక, అవినీతి పాలన

నిజాంపేట్: బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అవినీతి, ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తోందని రాష్ట్ర బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జ్ వేముల నరేందర్‌రావు అన్నారు. ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి 16వ శక్తి కేంద్రం, ప్రగతినగర్‌లోని 22వ శక్తి కేంద్రం పరిధిలో బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ అరుణ్‌రావు ఆధ్వర్యంలో స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో డంపింగ్‌యార్డు, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ భూములు, చెరువులు కబ్జా కోరల్లో చిక్కుకున్నా స్థానిక ప్రజాప్రతినిధులు వాటిని పరిరక్షించడంలో విఫలమయ్యారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు కేవలం ధనార్జనే ధ్యేయంగా పని చేస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికాలు, ప్రజాప్రతినిధులను నిలదీయడానికి ప్రజల తరపున బీజేపీ నిలబడుతుందన్నారు.

తెలంగాణలో రాబోయేది వైఎస్సార్‌టీపీ ప్రభుత్వమే..



వైఎస్ షర్మిలతో కలిసి పాదయాత్రలో పాల్గొన్న మేడ్చల్ జిల్లా నాయకులు

కుత్బుల్లాపూర్: వైఎస్సార్‌టీపీ అధినేత వైఎస్ షర్మిల చేపట్టిన పాదయాత్రలో ఆదివారం మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా వైఎస్సార్‌టీపీ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ముఖ్య నేతలు పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా వైఎస్ షర్మిల చేపట్టిన పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని అన్నారు. తెలంగాణలో రాబోయేది వైఎస్సార్‌టీపీ ప్రభుత్వమేనని నాయకులు పేర్కొన్నారు.

డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



మాట్లాడుతున్న ప్రజా గాయకుడు గద్దర్

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం రాత్రి ప్రజా గాయకుడు గద్దర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గద్దర్ మాట్లాడతూ.. దళితుల హక్కులు, సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, జగద్గిరిగుట్ట సీఐ సైదులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చిన్నారిపై కుక్కల దాడి

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో మరోసారి వీధి కుక్కలు విరుచుకుపడ్డాయి. కొంపల్లి 12వ వార్డులోని ఎన్‌సీఎల్ నార్త్‌లోని పార్కు వద్ద ఆడుకుంటున్న తేజస్(06)ను వెంబడించి మరీ కరిచాయి. దీంతో చిన్నారి కాలి భాగంలో గాయం కావడంతో స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఇప్పటికి ఇదే కాలనీలో 45 మంది వీధి కుక్కల బారిన పడి ఆస్పత్రులు పాలైనా అధికారులు ఘటనా జరిగిన సందర్భంలో హడావుడి చేసి ఆపై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని కాలనీవాసుల ఆరోపిస్తున్నారు. కాలనీలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి వీధి కుక్కలను తరలించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కుక్కలను తామే పట్టుకుని మున్సిపల్ కార్యాలయంలో విడిచిపెడతామని బీజేపీ నాయకులు శివాజీరాజు హెచ్చరించారు. వీధి కుక్కల విషయంలో అధికారులు స్పందించకుంటే త్వరలోనే మున్సిపల్ కార్యాలయాన్ని ప్రజలతో కలిసి ముట్టడిస్తామని పేర్కొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



మహదేవమ్మ (ఫైల్)

జగద్గిరిగుట్ట: అనుమానాస్పదంగా ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి ఎల్లమ్మబండ జన్మభూమి కాలనీకి చెందిన టైల్స్ వర్క్ చేసే నర్సింహ కుటుంబం గత నెల 29వ తేదీన తమ సొంత ఊరు నారాయణపేట్‌కు వెళ్లింది. కాగా వీరితో పాటే ఉంటున్న అత్త మహదేవమ్మ (63) ఇంటి వద్దనే వదిలిపెట్టి వెళ్లారు. అయితే ఫిబ్రవరి 9వ తేదీన ఇంటికి వచ్చి చూడగా మహదేవమ్మ కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల వారికి వాకబు చేయగా 29వ తేదీన ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తెలిపారు. వృద్ధురాలి కోసం బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో ఆదివారం కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కనులపండువగా అమ్మవారి జాతర



విశేష అలంకరణలో సూరారం కట్టమైసమ్మ

- కట్ట మైసమ్మ, రేణుకాఎల్లమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తజనం
- బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- ఆకట్టుకున్న పోతరాజు, శివసత్తుల విన్యాసాలు

సుభాష్‌నగర్: సూరారంలోని కట్ట మైసమ్మ, రేణుకాఎల్లమ్మ ప్రధాన జాతర ఆదివారం కనులపండువగా జరిగింది. డప్పు చప్పుళ్ల మధ్య బోనాలు, శివసత్తుల విన్యాసాలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకోవడానికి ఆలయాలని పోటెత్తారు. ఉదయం 5 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, అనంతరం శ్రీచక్రార్చన, కుంకుమార్చనలు నిర్వహించారు.

◆ కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లతో పాటు దుండిగల్, బహదూర్‌పల్లి ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యతో మహిళా భక్తులు బోనాలతో తరలివచ్చి అమ్మవారికి ఒడి బియ్యాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా కుటుంబ సమేతంగా ఆలయం సమీపంలో టెంట్‌లు ఏర్పాటు చేసుకుని వంటకాలు వండి కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.


◆ అదే విధంగా చిన్నారుల వినోదానికి ఏర్పాటు చేసిన రంగుల రాట్నాలు, తినుభండారాలు తదితర దుకాణాలతో ఆలయ చుట్టు పక్కల ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. పోతరాజులు, శివసత్తుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

పోలీస్ భద్రత..

జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పేట్‌బషీరాబాద్ ఏసీపీ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్ల సిబ్బందిని జాతర బందోబస్తులో నియమించారు.



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



అమ్మవారి చిత్రపటం వద్ద కలశాలతో పూజ



టెంకాయలు కొడుతున్న భక్తులు..

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు..

అమ్మవారిని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, దుండిగల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ తదితరులు దర్శించుకున్న వారిలో ఉన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి మల్లారెడ్డి



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వివేకానంద్



అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్..



బోనాలతో తరలివచ్చిన మహిళలు



ధనలక్ష్మి పెట్రోల్ బంక్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేస్తూ..



సూరారం కట్టమైసమ్మ ఆలయం వద్ద పోటెత్తిన భక్తజనం

బస్తీ దవాఖానాలతో పేదలకు మెరుగైన వైద్య సేవలు

- అసెంబ్లీలో ఎమ్మెల్యే వివేకానంద్
- ఆదివారం సైతం అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి



కుత్బుల్లాపూర్: తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆదివారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ బస్తీ దవాఖానాల్లో సేవలు, మెడికల్ కళాశాల ఏర్పాటు, ఆశా పోస్టుల భర్తీ తదితర అంశాలను ప్రస్తావించారు. పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించే మహోన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని అన్నారు. ఆదివారం బస్తీ దవాఖానాలకు సెలవు ఇవ్వకుండా అందుబాటులో ఉంచితే ప్రజలకు మరింత సేవలు అందుతాయని అన్నారు. అందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎం కేసీఆర్ గతంలో ఇచ్చిన మాట ప్రకారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 20 ఎకరాల హెచ్‌ఎంటీ స్థలాన్ని గుర్తించామన్నారు. అందులో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రి హరీష్‌రావును కోరారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని గాగిల్లాపూర్‌లో పేదలను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న భవనంలో బస్తీ దవాఖానా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై మంత్రి హరీష్‌రావు సమాధానమిస్తూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అవసరమైన బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో మెడికల్ కాలేజీ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

స్తంభం ఏర్పాటును అడ్డుకున్న స్థానికులు

సుభాష్‌నగర్: ఒక్కరి ప్రయోజనం కోసం కాలనీవాసులకే ఇబ్బంది కలిగేలా విద్యుత్ అధికారులు వ్యవహరిస్తున్నారని కృషికాలనీ మాజీ ప్రెసిడెంట్ పాషా ఆరోపించారు. సుభాష్‌నగర్ డివిజన్ కృషి కాలనీలోని ఆదివారం విద్యుత్ సిబ్బంది రాకపోకలకు ఇబ్బంది కలిగే విధంగా స్తంభం పాతడంపై స్థానికులు అడ్డుకున్నారు. గతంలో కొన్నిచోట్ల ఇష్టం వచ్చినట్లు విద్యుత్ పోల్ ఏర్పాటు చేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదురైందని పేర్కొన్నారు. ఒక్కరి ప్రయోజనం కోసం మళ్లీ అదే విధంగా ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో సిబ్బంది పనులు నిలిపివేసి వెనుదిరిగారు.



కృషి కాలనీలో విద్యుత్ స్తంభం ఏర్పాటు పనులను అడ్డుకుంటున్న స్థానికులు

భూములు అమ్మడమే తప్ప పంచిన దాఖలాలు లేవు

బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్



బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ భూములను విక్రయించడమే తప్ప పేదలకు పంచిన దాఖలాలు లేవని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ప్రజా గోస - బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా ఆదివారం జీడిమెట్ల డివిజన్ పరిధి వినాయకనగర్‌లో శక్తి కేంద్రాల స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌కు శ్రీశైలంగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎమ్మెల్యే వివేక్ తాను పని చేయడం లేదన్నారు. నియోజకవర్గంలో తిరగడం లేదని తన పిల్లలే చెబుతున్నారని అసెంబ్లీ సాక్షిగా ఒప్పుకున్నారని పేర్కొన్నారు.

◆ టీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న ఆయన బీఆర్ఎస్ ఎమ్మెల్యే అయ్యాడని.. త్వరలో వీఆర్ఎస్ ఎమ్మెల్యే అవుతాడని ఎద్దేవా చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వినాయకనగర్‌లో వేసిన డ్రైనేజీ లైన్‌లు, రోడ్లు వేశామని గుర్తు చేశారు. ఎనిమిదేళ్ల కాలంలో ప్రస్తుత ఎమ్మెల్యే చేసిందేమీ లేదన్నారు. బస్తీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి బీజేపీ నిరంతరం పోరాటాలు సాగిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ నర్సింగరావు, 488 బూత్ అధ్యక్షుడు చంద్రయ్య, 489 బూత్ అధ్యక్షుడు అబీద్, నాయకులు మురళి, పండు, నాగరాజు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి దిగ్బంధాన్ని విజయవంతం చేయాలి

కుత్బుల్లాపూర్: ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీల ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌-విజయవాడ జాతీయ రహదారి దిగ్బంధాన్ని విజయవంతం చేయాలని మాదిగ ఉపకులాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం కుత్బుల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు మాటాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేపడతామన్న కేంద్ర ప్రభుత్వం మాట తప్పిందని ఆరోపించారు. కేంద్రం వర్గీకరణ చేపట్టడంతో వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టేందుకు చేపట్టనున్న జాతీయ రహదారి దిగ్బంధం కార్యక్రమానికి వేలాదిగా మాదిగ ఉపకులాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. శ్రీనివాస్ మాదిగ, యాదగిరి, మహేష్, నర్సింహులు మాల, రాణి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

శాసనమండలి గౌరవ, మర్యాదలు పెంచేలా నడుచుకుంటా



సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: తెలంగాణ రాష్ట్ర శాసనమండలి ప్రభుత్వ విప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆదివారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ విప్‌గా శాసనమండలి గౌరవ మర్యాదలు పెంచేలా నడుచుకుంటానని ఈ సందర్భంగా శంభీపూర్ రాజు అన్నారు. అదే విధంగా శంభీపూర్‌లోని కార్యాలయంలో పలువురు ప్రజాప్రతినిధులు, సంక్షేమ సంఘాలు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్‌గా నియమితుడైన సందర్భంగా శంభీపూర్ రాజుకు అభినందనలు వెల్లువెత్తాయి.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం

జగద్గిరిగుట్ట: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. లయన్స్ క్లబ్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో జగద్గిరినగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన వాటర్ ఆర్వో ప్లాంట్‌ను ఆదివారం లయన్ కిషోర్ అగర్వాల్‌తో కలిసి జగన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు విఠల్‌రావు, పాపిరెడ్డి, శివారెడ్డి, ఇంద్రగౌడ్, గణేష్, లయన్స్ క్లబ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాలపై పోరాడుతున్నందుకే నాపై కుట్రలు

నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్

నిజాంపేట్: ప్రజా సమస్యలు, ప్రభుత్వ భూములు, చెరువు స్థలాల కబ్జాలపై పోరాడుతున్న తనను రాజకీయంగా, భౌతికంగా అడ్డు తొలగించేందుకు కొన్ని పార్టీల నాయకులు కుట్ర పన్నుతున్నారని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. ఆదివారం బీజేపీ నాయకులతో కలిసి తనపై కుట్ర పన్నుతున్న విషయమై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆయన బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

◆ ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ... నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో మౌలిక సదుపాయాల ఏర్పాటు విషయమై నిరంతరం పోరాటం చేస్తున్నానన్నారు. అదే విధంగా ప్రభుత్వ భూముల కబ్జాలు, అక్రమ నిర్మాణాలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి కాపాడే ప్రయత్నం చేస్తుండటంతో ప్రతిపక్ష, అధికార పక్ష పార్టీలకు మింగుడు పడటం లేదని పేర్కొన్నారు.

◆ దీనిపై ఆగ్రహించిన వారు తనను రాజకీయంగా ఎదుర్కోలేక భౌతికంగా తనపై దాడి చేసేందుకు అధికార పార్టీతో కొన్ని రాజకీయ పక్షాలు కుట్ర పన్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి వ్యక్తికి కొన్ని హక్కులు, బాధ్యతలు ఉంటాయన్నారు. ప్రజల ఆస్తులు కాపాడటంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. ప్రజాక్షేత్రంలో కబ్జాదారుల అవినీతి బాగోతాన్ని బయటపెట్టడానికి మరింత పని చేస్తామన్నారు.

◆ రాష్ట్ర మైనార్టీ మోర్చా మహిళా ప్రముఖ అమలేశ్వరి, జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు కాశి, ప్రధాన కార్యదర్శి భిక్షపతియాదవ్, కార్యవర్గ సభ్యుడు శివ, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాద్ రాజు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మదన్‌గౌడ్, కార్పొరేషన్ ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, 7వ డివిజన్ అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్, సీనియర్ నాయకులు మురళి, సతీష్, కృష్ణ తదితరులు ఫిర్యాదు చేసిన ఉన్నారు.



బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు